ప్రజాశక్తి

మంగళవారం 8 అక్టోబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

మద్యం టెండర్లు అడ్డగింత

- గన్నవరం ఎక్సైజ్ స్టేషన్ వద్ద అలజడి
- టెండరుదారులకు బెదిరింపులు

ప్రజాశక్తి - గన్నవరం : కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలో మద్యం టెండర్లు వేయకుండా కొంతమంది వ్యక్తులు అడ్డుకోవడం వివాదాస్పదంగా మారుతోంది. సోమవారం గన్నవరం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట టెండర్లు వేయకుండా పలువురు అడ్డుకోవడం అలజడి రేపింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా కొత్త సంస్కృతికి తెర తీసిన పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది. టెండర్లు వేస్తే ఊరుకోబోమని అధికార పార్టీకి చెందిన వ్యక్తులు హుకుం జారీ చేస్తున్నారని చెబుతున్నారు. సహజంగా నియోజకవర్గంలో మద్యం టెండర్లు ప్రక్రియ మొదలైతే 23 షాపులకు వందల సంఖ్యలో టెండర్లు పడేవి. ఈసారి బెదిరింపులు రావడంతో చాలామంది ఆలోచనలో పడ్డారు. 23 షాపులకు ఇప్పటికి 35 దరఖాస్తులు మాత్రమే పడ్డాయి. ఇంకా రెండు రోజుల సమయం ఉంది. ఎన్ని దరఖాస్తులు వస్తాయో తెలియడం లేదు. అయితే సోమవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుటకొంతమంది యువకులు నిలబడి టెండర్ వేయడానికి వెళ్లే వ్యక్తులను అడ్డుకొని బెదిరింపులకు దిగినట్లుగా తెలిసింది. టెండర్ వేస్తే ఊరుకోబోమని, భవిష్యత్తులో షాపు వచ్చినా వ్యాపారం చేయనీయబోమని హెచ్చరించినట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు తమకేమీ తెలియదన్నట్లుగా ఉండిపోయారు. గుర్తు తెలియని వ్యక్తుల అలజడి (మిగతా 2లో)

16 నుండి పూర్తి స్థాయిలో ఉచిత ఇసుక : మంత్రి కొల్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఈనెల 16 నుంచి పూర్తిస్థాయిలో ప్రజలకు ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నంలోని రహదారులు భవనాల అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జూలై 8 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. అయితే వర్షాకాలం ప్రభావంతో జిల్లాలోని కృష్ణానదీ పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక బయటకు తెచ్చేందుకు అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ఈనెల 16 నుంచి ఉచిత ఇసుకను అందుబాటులోకి తెస్తామని, ఈలోగా ర్యాంపుల నిర్మాణం ఇతర రవాణా సౌకర్యాలను సమకూరుస్తామని తెలిపారు. జిల్లాలో డీసిల్టేషన్ పాయింట్లు 28, మాన్యువల్108, సెమీ మేకనైజ్డ్ రీచ్‌లు 48 ఉన్నాయన్నాని తెలిపారు. పట్టా భూములను గుర్తించి వాటి నుంచి సైతం డిమాండ్‌కు తగిన విధంగా ఇసుకను అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉచిత ఇసుక విధానం, ధరల నిర్ణయాన్ని జిల్లా స్థాయి ఇసుక కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. వినియోగదారులు కేవలం రవాణా, నిర్వహణ ఖర్చులు మాత్రమే చెల్లించాల్సి (మిగతా 2లో)

1.71 లక్షల కుటుంబాలకు రూ.281 కోట్లు జమ

- తాజాగా 13 వేల పెండింగ్ ఖాతాల్లో రూ.15 కోట్లు
- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - విజయవాడ : వరద ప్రభావిత ప్రాంతాల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పరిహారానికి సంబంధించి ఇప్పటివరకు 1.71 లక్షల మంది లబ్ధిదారుల కుటుంబాలకు రూ.281 కోట్లను వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. వివిధ సమస్యల వల్ల పెండింగ్లో ఉన్న 13 వేల కుటుంబాలకు సంబంధించి వారి ఖాతాలను సరిచేసుకోవడం వల్ల దాదాపు రూ.15 కోట్ల పరిహారాన్ని వారి ఖాతాలకు సోమవారం జమ చేశామన్నారు. 13వేల కుటుంబాలకు సంబంధించి ఖాతాలను సరి చేసుకోవడం వల్ల పరిహారాన్ని వారి ఖాతాలకు నేరుగా జమ చేసినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతా మనుగడలో లేకపోవడం, మొబైల్ నెంబరు, ఆధార్‌తో బ్యాంక్ ఖాతా అనుసంధానం, మరణించిన వారి, మైనర్ల పేర్లతో బ్యాంక్ ఖాతాలు ఉండడం తదితర కారణాలవల్ల పరిహారం అందజేయడంలో ఇబ్బంది ఎదురైనట్లు గుర్తించి వాటిని 179 సచివాలయాల కార్యదర్శులు ఆయా కుటుంబాలను సంప్రదించి సరిచేసినట్లు తెలిపారు.

కాలుష్య రహిత నగరానికి చర్యలు

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : కాలుష్య రహిత నగరానికి చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చర్చించారు. దీనిలో భాగంగా పచ్చదనాన్ని మరింతగా పెంచి నగర సుందరీకరణ, కాలుష్య నియంత్రణకు సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల అభివృద్ధి, తాగునీరు, నీటి సరఫరా, ఆనధికార నిర్మాణాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నగరంలో ఎక్కువ మొక్కలను నాటుతూ కాలుష్యరహిత సమాజాన్ని నిర్మించేలా నగర సుందరీకరణ చేయటానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కేవలం వాయువు కాలుష్యమే కాకుండా నీటిని కూడా సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల అభివృద్ధి ద్వారా శుద్ధి చేస్తూ నీటి కాలుష్యాన్ని చర్యలు తీసుకోమని అధికారులు అన్న ఆదేశించారు. నగరంలో అనధికార నిర్మాణాలు జరగకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డి చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, సూపరెండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) పి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకటేశ్వర రెడ్డి, ఎపిఎస్ ప్రసాద్, సామ్రాజ్యం, చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, పిఒయుసిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దసరా మహోత్సవాలకు ప్రత్యేకాధికారి నియామకం

ప్రజాశక్తి - విజయవాడ : కనకదుర్గ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలకు దేవాలయ శాఖ అదనపు కమిషనర్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం ఆదేశాలు ఇచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో కీలకమైన చివరి నాలుగు రోజుల్లో ఉత్సవాల్లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు, అన్ని విభాగాలను సమన్వయపరచు కునేందుకు ఆయనను నియమించారు. ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో, ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మూలా నక్షత్రం రోజైన ఈనెల 9న తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చే వారికి దుర్గమ్మ దర్శనం సులభంగా కలిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ అధికారులు ఉత్సవాల నిర్వహణలో కీలకంగా పనిచేయాలని మంత్రి ఆనం ఆదేశించారు.

నిషేధిత జాబితా నుండి తొలగించిన భూములపై నివేదిక ఇవ్వండి

సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీ జయలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములకు సంబంధించిన వివరాల నివేదికను అందజేయాలని సిసిఎల్ఏ జాయింట్ సెక్రటరీ జయలక్ష్మి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హాజరయ్యారు. నిషేధిత భూముల జాబితా నుంచి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినవి, చట్టాన్ని ఉల్లంఘించిన వాటి పూర్తి వివరాలను నివేదికలో స్పష్టంగా అందజేయాలని జయలక్ష్మి వివరించారు. ఇప్పటికే సమర్పించిన వివరాలను పున:పరిశీలించాలని ఆమె సూచించారు. రిజిస్ట్రేషన్ జరిగిన భూముల వివరాలను నివేదికలో పొందుపరచాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో భూ సేకరణ సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నష్టపోయాం... పరిహారం ఇవ్వండి మహాప్రభో

బాధిత రైతుల వినతి

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : భారీ వర్షాలు, వరదలతో ముంపుకు గురైన పంటలకు పరిహారం అందలేదని రైతులు వాపోయారు. వెంటనే తమకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మచిలీపట్నంలోని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో పలువురు రైతులు వినతిపత్రాలు అందించారు. వరి పంటకు సంబంధించి కోడూరు మండలం లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన మహ్మద్ యాకూబ్, మహ్మద్ లతీఫ్, అబ్దుల్ కలామ్ అన్సారీలు వినతిపత్రం అందించారు. ఉద్యాన పంటలకు సంబంధించి తోట్లవల్లూరు మండలం చాగంటిపాడులో పంట నష్టపోయిన, వరదలకు భూమి కోతకు గురైన ఎస్‌సి రైతులకు పరిహారం అందలేదని, వెంటనే పరిహారం ఇప్పించాలని ఎన్.రాజ్‌కుమార్ వినతిపత్రం అందించారు.

ధాన్యం కొనుగోలు చేసి రూ.2.50 కోట్లు ఎగవేసిన వ్యాపారిపై బాధిత రైతుల ఫిర్యాదు

నాగాయలంక మండలం పర్రచివర గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి బండ్రెడ్డి వెంకటేశ్వరరావు (బాబు) ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో పర్రచివర, పరిసర గ్రామాలకు చెందిన 50 మంది రైతుల నుంచి రూ.2.50 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశాడు. అయితే ఎనిమిది నెలలుగా ధాన్యం అమ్మిన రైతులకు నగదు చెల్లించలేదు. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో కృష్ణా జిల్లా కలెక్టర్ డికె.బాలాజీకి వినతిపత్రం అందించారు.

నా భర్త ఆత్మహత్య చేసుకున్నాడు : దేవరబోయిన వెంకటేశ్వరమ్మ, పర్రచివర, నాగాయలంక మండలం

ఈ ఏడాది ఫిబ్రవరిలో ధాన్యం వ్యాపారి బండ్రెడ్డి వెంకటేశ్వరరావు (బాబు)కు ధాన్యం విక్రయించా. రూ.1.60 లక్షలు నగదు చెల్లించాలి. భర్త బాలఏసుతోపాటు ధాన్యం నగదు కోసం వ్యాపారి చుట్టూ ఎనిమిది నెలలుగా తిరుగుతూనే ఉన్నాము. వ్యాపారికి ధాన్యం విక్రయించడంపై భర్త బాలఏసు నాతో గొడవపడ్డాడు. మనస్తాపానికి గురై పురుగుమందు తాగాడు. బందరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.

డబ్బులడుగుతుంటే సమాధానం చెప్పడం లేదు : పరిశే ప్రసాద్, రైతు, పర్రచివర, నాగాయలంక మండలం

వ్యవసాయానికి పెట్టుబడి నిమిత్తం ధాన్యం వ్యాపారి బాబు వద్ద తీసుకున్నా. పండించిన పంటను వ్యాపారికి విక్రయించా. వ్యాపారి పెట్టిన పెట్టుబడి పోను నాకు రూ.1.32 లక్షలు రావాలి. డబ్బుల గురించి అడుగుతుంటే వ్యాపారి సరైన సమాధానం చెప్పడం లేదు. జూన్లో నాగాయలంక పోలీసు స్టేషన్లో డబ్బులు రావాల్సిన రైతులంతా కలిసి ఫిర్యాదు చేశాం. అక్కడ న్యాయం జరగలేదు.

రూ.12.30 లక్షలు రావాలి : కొక్కిలిగడ్డ సముద్రాలు, దీనదయాళపురం, నాగాయలంక మండలం

ఐదెకరాల్లో రెండేళ్లపాటు పండించిన బిపిటి 5204 రకం ధాన్యం 530 బస్తాలు (75 కిలోల బస్తా) వ్యాపారి బాబుకు విక్రయించా. వ్యాపారి నుంచి రూ.12.30 లక్షలు రావాలి. మా డబ్బులు ఇప్పించాలని జిల్లా ఎస్‌పి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
పటమట శాఖ, ఫోన్: 7010727336
సవరణ
తేది. 24-09-2024న "ప్రజాశక్తి" దినపత్రికలో ప్రచురించిన ఈ-వేలం ప్రకటన నోటీసులో ఋణగ్రహీత శ్రీ తేల రాధాకృష్ణ నోటీసులో ఈ-వేలం సర్వీస్ ప్రొవైడర్ వివరములు ebkray బదులుగా mstcecommerce అని తప్పుగా ప్రచురించారు. మిగిలిన వివరములలో ఎటువంటి మార్పులు లేవు.
స/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

దసరా మహోత్సవాల పర్యవేక్షణ

ప్రజాశక్తి - విజయవాడ, అర్బన్, వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను సోమవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన, లా అండ్ ఆర్డర్ ఐజి సి.హెచ్. శ్రీకాంత్ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు పర్యవేక్షించారు. మోడల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి సిసి కెమెరాల ద్వారా అన్ని ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఇంద్రకీలాద్రిపైకి వెళ్లి మెట్ల మార్గం, క్యూలైన్లను పరిశీలించారు. బందోబస్తులోని అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. అలాగే మూలా నక్షత్రం రోజున ప్రత్యేక ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు గౌతమి షాలి, ఎడిసిపిలు, ఎసిపిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఏలూరు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
M.V.O.P.No.112/2024
విష్ణుమూర్తుల అచ్చిబాబు ...పిటీషనరు
Vs
దూసరి చంద్ @ చందు వగైరా ...రెస్పాండెంట్లు
To.
R2 :
సాలిమెట్ల అమ్ములు @ సెల్మెట్ల అమ్ములు, S/o.వేంకటేశ్వరరావు, టాటా యోధ వ్యాన్‌నెం. AP 39 V A6199 ఓనరు, R/o.ఇల్లపర్రు, H/o.జనార్ధనపురం, నందివాడ మండలం, కృష్ణాజిల్లా.
పై నంబరు గ్రంథములో మీరు (R-2) ది.24-10-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు స్వయముగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలంగా తెలియచేయడమైనది.
By Order
E.తూకారాం
Advocate, Adhivarapu pet,
Bodduvari Street,
Eluru, W.G.Dt.

మొదటిపేజీ తరువాయి

16 నుండి పూర్తిస్థాయిలో ఉచిత ఇసుక : మంత్రి కొల్లు

ఉంటుందన్నారు. సొంత వాహనం కలిగిన వారు లోడింగ్ చార్జీలు మాత్రమే చెల్లించి ఇసుకను పొందవచ్చన్నారు.

నాణ్యమైన మద్యం సరఫరా : మంత్రి

ఇటీవల 3,336 మద్యం షాపులకు మొదటి విడత నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 20 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. తర్వాతి దశలో గీత కార్మికులకు 10 శాతం 340 షాపులు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మచిలీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు

మచిలీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని మంత్రి కొల్లు తెలిపారు. స్వచ్ఛాంధ్ర మిషన్ ద్వారా డంపింగ్ యార్డ్ ప్రక్షాళనకు రూ.12 కోట్లు కేటాయించిందని తెలిపారు. అలాగే రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మచిలీపట్నం కార్పొరేషన్ అభివృద్ధి నిమిత్తం 15వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా రూ.16 కోట్లు కేటాయించారని తెలిపారు. విజన్-2047లో భాగంగా మచిలీపట్నంలో సక్రమ పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజ్ ప్రక్షాళన, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటూ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణం నిమిత్తం సిఎం చంద్రబాబు రూ.2 కోట్లు కేటాయించారని తెలిపారు. ఎన్ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.30 కోట్లతో ప్రతి గ్రామంలో రాబోయే మూడేళ్లలో డ్రైనేజీ వ్యవస్థ, పేదవారికి ఇళ్ళు, సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు బండి రామకృష్ణ, తలారి సోమశేఖర్, కుంచె నాని, ఇలియాజ్ పాషా, ఖాజావలి, కొట్టే వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లు అడ్డగింత

విషయాన్ని తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన స్టేషన్ వద్దకు వచ్చారు. ఇది గమనించిన యువకులు తలోదారిన వెళ్లిపోయారు.

టెండర్ దారులను అడ్డుకుంటే సహించేది లేదు : ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

టెండర్ దారులను అడ్డుకుంటే సహించేది లేదని ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. టెండర్ల అడ్డగింతపై సమాచారం అందుకున్న ఆయన మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఆయన స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను పరిశీలించారు. పోలీసులను బందోబస్తు పెట్టి స్వేచ్ఛగా టెండర్లు వేసే పని చూడాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో 236 షాపులకు 1100 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో 23 షాపులకుగాను 35 టెండర్లు మాత్రమే వేసినట్లు చెప్పారు. చాలా తక్కువగా నమోదయ్యాయని, రెండు రోజుల్లో మరిన్ని దరఖాస్తులు రావచ్చని తెలిపారు. మద్యం షాపుకు టెండర్ వేయదలచిన వారు నేరుగా బ్యాంకు నుండి డిడి ద్వారా, ఆన్లైన్ ద్వారా కూడా టెండర్లు వేయవచ్చని తెలిపారు.

In The Court Of The
Junior Civil Judge cum
Additional I.A Judicial
Kaikaluru, Eluru Dist
I.A No. 180/2024 in
O.S. No. 213/2022
Plaintiff/Petitioner:
Kothapalli Narasimha raju
and
Respondent/Defendant:
Madireddy Narendra Kumar, S/o Nagendra Rao, D.No.1/4, Pothepalli Village, Machilipatnam Mandal, Krishna Dist.
పై నెంబరు పిటీషన్ అనగా **I.A No. 180/2024** in **O.S. No. 213/2022** లో ***Plaintiff*** అనేక పర్యాయములు మీకు నోటీసులు కోర్టు ద్వారాను, పోస్టల్ ద్వారాను పంపించినను, వాటిని మీరు ఉద్దేశ్య పూర్వకంగా అందుకొని యుండలేదు. అందువలన శ్రీ కోర్టు వారు **Substitute Service** ద్వారా అమలుచేయమని ఆర్డరు వేసి యున్నారు. మీరు **ది. 28-10-2024 తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను. అట్లు హాజరు కానిచో పరోక్షములో సదరు పిటీషన్‌ను తీర్మానించబడునని ఇందుమూలముగ తెలియచేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
P. Raja Rao
Advocate
Bhimavaram
Cell: 94401 30111
కైకలూరు
వాయిదా తేది: 28-10-2024

సమన్వయంతో కృష్ణాజిల్లా అభివృద్ధి : మంత్రి కొల్లు

మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : సమన్వయంతో కృష్ణాజిల్లా అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగంగా సోమవారం కలెక్టరేట్లో జిల్లా మంత్రి కొల్లు...శాసనసభ్యులతో వర్క్‌షాప్ నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ డికె బాలాజీ మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో జిల్లా స్థూల ఉత్పత్తి 15 శాతం పెంచాలని లక్ష్యంతో జిల్లా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయడానికి ప్రజాప్రతినిధుల సూచనలు సలహాలు తీసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ త్వరలో మచిలీపట్నం పోర్టు వస్తోందని, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులకు ఏపీ ముఖ్యంగా మచిలీపట్నం నాంది కాబోతోందని, తద్వారా ప్రపంచ స్థాయి జిల్లాగా నిలబెట్టవచ్చు అన్నారు. సముద్రపు ఉప్పు నీరు చొచ్చుకు రాకుండా కట్టడి చర్యలు తీసుకోవాలన్నారు. హేచరీస్, ప్రాసెసింగ్ ప్లాంట్లు అభివృద్ధి చేయాలన్నారు. హంసలదీవి, ఘంటసాల, కూచిపూడి, మంగినపూడి బీచ్ వంటి ప్రాంతాలలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ మాట్లాడుతూ ఉయ్యూరు కంకిపాడు ఏరియాలో మినుము దిగుబడి బాగుందని, అయితే ఎల్లో మొజాయిక్ వైరస్ సోకుతోందని, నివారణ చర్యలు తీసుకోవాలని, దాల్వాకు అవకాశం ఇవ్వాలని రబీలో కూడా ధాన్యం కొనుగోలు చేయాలని ఈ ప్రాంత రైతుల కోరుతున్నట్లు తెలిపారు. పెనమలూరు ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు మాస్టర్ ప్లాన్‌లో ఉన్న ప్రత్యామ్నాయ రహదారులు అభివృద్ధి చేయాలని, ఇన్నర్ రింగ్, బైపాస్, ఓఆర్ ఆర్, ఇవన్నీ ఐదేళ్లలో పూర్తి చేయాలన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలన్నారు. గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రావెల్ ద్వారా రాయల్టీ ఎక్కువగా ఈ ప్రాంతం నుండి వస్తున్నదని, డిస్ట్రిక్ మినరల్ ఫండ్ నిధులు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు కేటాయించాలని అన్నారు. గన్నవరంలో మీటింగ్ హాల్ లేదని, గెస్ట్ హౌస్ లేదని, వాటిని ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణ వేగంగా జరగాలని, పోలీస్ స్టేషన్ లు, ఫైర్ స్టేషన్లను ఆధునికరించాలని, మల్లవల్లి పారిశ్రామిక వాడలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని, దీని విస్తరణకు మరింత భూమి సేకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ తోట్లవల్లూరు మండలంలో లంక గ్రామాల్లో వాణిజ్య పంటలు బాగా పండుతాయని, రైతులను ప్రోత్సహించాలని, పాములంక వంతెన నిర్మించాలని, మెగైన్ ఫుడ్ ఎక్స్‌పోర్ట్ పరిశ్రమలకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని, బెల్ కంపెనీ రావడంతో ఈ ప్రాంతం ఇండస్ట్రియల్ కారిడారుగా అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇక్కడ ఐటి హబ్ ప్రమోట్ చేయాలని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, ప్రైవేట్ రంగంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రానుందని అన్నారు. పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ శివారు కావున సాగునీరు సరిగా అందని ప్రాంతమని, ఇరిగేషన్ కాలువలు తవ్వించి గట్లను పటిష్టం చేయాలని, డ్రైన్ పూడికతీత చేపట్టి, పొలాల ముంపు నివారణ చేయాలని, ఆక్వా రంగానికి కరెంటు సబ్సిడీ అందించాలని, లో వోల్టేజ్ సమస్య పరిష్కరించాలని, చేనేత కార్మికులకు వర్షాలకు నీట మునిగే మగ్గాలకు పరిష్కారం చూపాలని అన్నారు. చిన్న గొల్లపాలెంలో పర్యాటకం అభివృద్ధి చేయాలని, పాండ్రాక పిహెచ్‌సీలో వైద్య సిబ్బందిని నియమించాలని, పెడనలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి వేస్ట్ మేనేజ్మెంట్ చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గంలో పాఠశాలలకు భవనాలు నిర్మించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె చంద్రశేఖరరావు, బందరు ఆర్డిఓ కే స్వాతి, డ్రామా పీడీ ఎన్వవి శివప్రసాద్, సిపిఓ గణేష్ కప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విఆర్‌కు కోడూరు ఎస్ఐ శిరీష

ఎస్ఐ శిరీష

ప్రజాశక్తి కోడూరు : కోడూరు ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న వి. శిరీష తన పుట్టినరోజు విషయాన్ని గోప్యంగా ఉంచింది. కానీ కోడూరు పిఎస్‌లో పనిచేస్తున్న ఒక కానిస్టేబుల్ ఆ విషయాన్ని మీడియా వారికి తెలియపరిచారు. అది తెలిసి సోషల్ మీడియా ద్వారా పలువురు ఎస్సై శిరీష కు శుభాకాంక్షలు తెలియపరిచారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. ఈ విషయంపై స్పందించిన బీసీ సంఘం నేతలు, కూటమి నాయకులు, పోటీలు పడి మరీ కోడూరు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి ఆమె వద్దు అని నివారించినప్పటికీ జన్మదిన వేడుకలు భారీ గా టపాసులు కాల్చి కేకులు కట్ చేసి నిర్వహించారు. ఆ ఫోటోలను సోషల్ లో ప్రచురించగా ఎస్సై జన్మదిన వేడుకలు వైరల్ గా మారాయి. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై జన్మదిన వేడుకలు నిర్వహించడం ఏమిటి అన్న విషయంపై సామాజిక మాధ్యమాలలో వచ్చిన కథనానికి జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి పనిష్మెంట్గా ఎస్ఐ శిరీషను విఆర్‌కు పంపించారు.

కోడూరు ఎస్ఐగా చాణిక్య

ఎస్ఐ చాణిక్య

కోడూరు సబ్ ఇన్స్పెక్టర్‌గా కే.చాణిక్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం మచిలీపట్నం రూరల్‌లో ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న కే.చాణిక్య జిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు కోడూరు బదిలీపై బాధ్యతలు చేపట్టారు.

గూడూరు పోలీస్‌స్టేషన్ పరిశీలించిన ఎస్‌పి

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

ప్రజాశక్తి-గూడూరు : ఆకస్మిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు సోమవారం గూడూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. మొదటగా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు, భౌగోళిక పరిస్థితులు పరిశీలించి పోలీస్ స్టేషన్ ఆవరణపై సంతృప్తి వ్యక్తపరిచారు. అలాగే పోలీస్ స్టేషన్లో ఉన్న అన్ని రూమ్ లను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని ఎస్సై సత్యనారాయణకి సూచించారు. పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న అన్ని రికార్డులను గూర్చి ఎస్పని అడిగి తెలుసుకుని రికార్డ్ ల నిర్వహణలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించ వద్దని ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉంచాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో గాని, నేరాల ఛేదన లో గాని, బందోబస్తు ఏర్పాట్లను అన్నింటిని సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం తదుపరి కోనేరు సెంటర్‌కి వచ్చి ట్రాఫిక్ పరిస్థితులను, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరు, అధికారుల పర్యవేక్షణ మొదలైన అంశాలను పరిశీలించారు.దసరా శరన్నవ రాత్రుల్లో భాగంగా మూలా నక్షత్రం రోజు శక్తి పటాల ఊరేగింపు సందర్భంగా నిర్వహించాల్సిన బందోబస్తు విధుల గూర్చి ఆర్ పేట, ఇనుకుదురు, చిలకలపూడి సిఐలు, ట్రాఫిక్ ఎస్.ఐ. లకు సూచనలు చేశారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

విద్యుత్ అధికారులు

అలసత్వం వీడాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : విద్యుత్ సమస్యల విషయంలో సంబంధిత అధికారులు అలసత్వం వీడి పని చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. సోమవారం అవనిగడ్డ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల కోడూరు నాయుడుపేటలో విద్యుత్ సమస్యపై ప్రజలు రోడ్డు ఎక్కే వరకు తీసుకురావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఆందోళనలకు ఆస్కారం ఇవ్వకుండా సత్వర స్పందన ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉయ్యూరు డి ఈ డి కృష్ణనాయక్ మాట్లాడుతూ వరద ముంపు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అవనిగడ్డ చల్లపల్లి ఏడిఈఈ లు నడకుదుటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పులి శివ నాగేశ్వరరావు, సబ్ ఇంజనీర్లు టీ ప్రసాద్ రాజు గోపి పాల్గొన్నారు.

శీలం ప్రకాశరావుకు పరామర్శ

ప్రజాశక్తి-మొవ్వ : ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు గత కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతున్నాడు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు యద్దనపూడి మధు, బండారు వెంకటేశ్వ రరావు ప్రకాశ రావును ఇంటి వద్ద సోమవారం పరామ ర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను కుటుంబ సభ్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.

శీలం ప్రకాశరావును పరామర్శిస్తున్న వై.వెంకటేశ్వర్లు

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కంకిపాడు : మండలం లోని పునాదిపాడు నుంచి కోలవెన్నుకు బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొన్న సంఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. కోలవెన్నుకు చెందిన వణుకూరు పార్థసారథి (42) పునాదిపాడు నుంచి సొంత ఊరుకు వస్తుండగా ఆటో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఎలుకల నివారణతో రైతుకు మేలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని రైతులందరూ సామూహిక ఎలుకల నివారణ చేపట్టి తమ పంటలను కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో సామూహిక ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి గోడ పత్రిక ఆవిష్కరించారు.విత్తనం వేసినది మొదలు ధాన్యం అమ్మే వరకు ఎలుకలు వరి పైరుకు, ధాన్యానికి అపార నష్టం కలిగిస్తాయని, ఎలుకలను సమర్థవంతంగా నివారించుటకు వ్యవసాయ శాఖ వారు సూచించిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. జింక్ ఫాస్పైడ్, బ్రోమోడైలోన్ లేదా అల్యూమినియం ఫాస్పైడ్ రసాయనాలను ఉపయోగించి రైతులు ఎలుకలను సామూహికంగా నివారించాలని, ప్రస్తుతం జిల్లా వ్యవసాయ శాఖ వారు బ్రోమోడైలోన్ మందును 100 శాతం రాయితీపై రైతు సేవా కేంద్రాలలో సరఫరా చేస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి జె జ్యోతి, జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి ఎన్ పద్మావతి, జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రావు, వ్యవసాయ శాఖ డిడి మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎన్‌జి గ్యాస్ కొరతను పరిష్కరించాలని ధర్నా

ఆందోళన చేస్తున్న ఆటోడ్రైవర్లు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా): మచిలీపట్టణంలో సీఎన్జీ గ్యాస్ కొరత వలన ఉపాధి కోల్పోయిన ఆటోకార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు కృష్ణాజిల్లా కోశాధికారి బూర. సుబ్రహ్మణ్యం అధికారులను డిమాండ్ చేశారు. నాలుగు రోజుల నుండి సిఎన్జి గ్యాస్ కొరత వలన ఇబ్బంది పడుతున్న ఆటో కార్మికుల ఉపాధి కాపాడండి అని కోరుతూ సోమవారం మచిలీపట్నం మూడు స్థంభాల సెంటర్ నుండి ధర్నా చౌక్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ మచిలీపట్నంలో సిఎన్జి గ్యాస్ కొరత వలన గత నాలుగు రోజుల నుండి సుమారుగా 500 మంది కార్మికులకు కిరాయిలు లేక ఇబ్బంది పడుతున్నారని, ఇంత ఇబ్బందిలో కూడా బజాజ్ షోరూం ఫైనాన్స్ వారు "ఈ మ్ ఐ లు" కట్టాల్సిందేనని చెప్పటం దుర్మార్గమని ఆయన అన్నారు. జిల్లా ముఖ్య పట్టణమైన మచిలీపట్నంలో ఒకే ఒక్క గ్యాస్ బంక్ ఉండటం వలన, మచిలీపట్నంలో నిర్వాకుల నిర్లక్ష్యం వలన పామర్రు, పెడన గుడివాడ, నాగాయ లంక వెళ్లి గ్యాస్ ఫిల్ చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని, దానివల్ల ఆర్థిక భారం మరింత పెరుగుతుందన్నారు. గ్యాస్ కొరతను వెంటనే పరిష్కరించి 24 గంటలు బంకులో సిఎన్జి గ్యాస్ అందుబాటులో ఉండే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరీముల్లా, షేక్ బాజీ,అబ్దుల్ ఖయ్యూం, కంచర్లపల్లి శ్రీనివాసరావు, సునీల్ రాజేష్, రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : ఖాదర్ ఖాన్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని కాకినాడ రిటైర్డ్ ప్రిన్సిపాల్ భారతలక్ష్మి అన్నారు. సోమవారం చల్లపల్లిలో ఎంఎ ఖాదర్ ఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారత లక్ష్మీ 15 మంది పేద విద్యార్థులకు రూ.లక్ష విలువ కలిగిన ఉపకార వేతనాలు అందచేశారు. ట్రస్ట్ ఫౌండర్ ముజీనా బాను, ట్రస్టు సభ్యులు నసీరుద్దీన్, మునీర్ ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలపై చర్చలు సఫలం

డిఎంఅండ్‌హెచ్‌ఒకు ఆశా వర్కర్ల సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న కమల, యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ: ఆశా వర్కర్లు ఎదుర్కొనే స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం విజయవాడలో పాత గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద ఉన్న కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జాయింట్ మీటింగ్ జరిగింది. సుమారు మూడు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో జిల్లాలో ఆశాలు ఎదుర్కొనే పలు సమస్యలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ యం.సుహాసిని దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ గతంలో జరిగిన జాయింట్ మీటింగ్‌లో సమస్యల పరిష్కారానికి ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అవి నేటికీ అమలు కాలేదన్నారు. ఆశాలతో క్లీనింగ్ పనులు చేయించరాదన్నారు. సచివాలయాల్లో వెల్నెస్ సెంటర్లో ఉదయం 9 నుంచి 4 గంటల వరకు కూర్చోబెట్టడం, రిజిష్టర్లు పెట్టి సంతకాలు చేయించడం చేయరాదని కోరారు. సర్వేల ఆన్లైన్ వర్క్ ఆశాలతో చేయించ రాదన్నారు. ఫ్రైడే డ్రైడే రోజున ఆశాలతో ఎబేట్ చెల్లించటం వంటివి చేయించరాదని పేర్కొన్నారు. ఓపి డ్యూటీ, నైట్ డ్యూటీలు, 104 వ్యాన్ వచ్చినప్పుడు ఆశాలతో బీపీ, షుగర్ చేయించరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. సమస్యలపై డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ యం.సుహాసిని సానుకూలంగా స్పందిస్తూ స్థానిక సమస్యలపై కొందరి మెడికల్ ఆఫీసర్స్‌తో వెంటనే ఫోన్లో మాట్లాడటమే కాకుండా మిగిలిన సమస్యలపై వెంటనే సర్క్యులర్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డిఐఒ అమృత, డిసిఎం హరీష్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రత్తిపాటి జ్యోతి, కోశాధికారి పి.శ్రీలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.దయామని, యం.వెంకటరమణ, పి.సునీత, సుజాత, నాగమణి, తిరుమలేశ్వరి, వనజ నాగేశ్వరి, జానకి, రత్నకుమారి హవేలీ కుమారి, భీమాల లక్ష్మి ఎస్ పద్మ తదితరులు పాల్గొన్నారు. దసరా డూటీలు చేస్తున్న ఆశా వర్కర్లకు టిఎ, డిఎలు ఇవ్వాలని డిఎంఅండ్‌హెచ్ఒకు వినతిపత్రం అందజేయగా, తమ పరిధిలో లేని సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని డిఎంఅండ్‌హెచ్ఒ హామీనిచ్చారు.

అంగన్‌వాడీలపై అదనంగా బిఎల్ఒ భారం వద్దు

కృష్ణాజిల్లా కలెక్టర్‌కు యూనియన్ నాయకుల వినతి

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: అంగన్‌వాడీలపై బూత్ లెవెల్ ఆఫీసర్ (బిఎల్ఒ) అదనపు భారం మోపొద్దని, ఇప్పటికే బిఎల్ఒలుగా విధుల్లో ఉన్నవారిని వెంటనే ఆ బాధ్యతల నుంచి తప్పించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీకి సోమవారం యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజువారీ నాలుగు యాప్‌లు నమోదు చేయాలని, చిన్నారులకు ప్రీ స్కూల్ నిర్వహణ, టేక్ హోం రేషన్ పంపిణీ, గర్భిణీలు, బాలింతలకు ఫేస్ రికగ్నజేషన్ సర్వీసులు నిర్వహించడంతోనే సమయం సరిపోతుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని పెనమలూరులో 52, గన్నవరంలో ఏడుగురు, బాపులపాడులో ఏడుగురు చొప్పున 72 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు బిఎల్ఒలుగా అదనపు బాధ్యతలు అప్పచెప్పారని, బిఎల్ఒ బాధ్యతల నుంచి అంగన్‌వాడీలను తప్పించాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ ప్రసన్న, రేవతి, హసీనా తదితరులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

తిరువూరు ఆర్‌డిఓగా మాధురి బాధ్యతలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు ఆర్‌డిఒగా కె.మాధురి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్‌డిఓగా పనిచేసిన మాధవి అమలాపురం బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఆర్‌డిఓ ట్రైనింగ్‌లో ఉన్న మాధురిని నియమించారు. ఆమెకు తిరువూరు, గంపలగూడెం మండలాల తహశీల్దార్లు, విఆర్ఓలు, ఆర్ఐలు, సిబ్బంది స్వాగతం పలికి అభినందించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్తు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

లీడ్ గ్రూప్ శిక్షా అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ప్రముఖ స్కూల్ ఎడ్‌టెక్ కంపెనీ లీడ్ గ్రూప్ అతిపెద్ద పాఠశాల అవార్డుల కార్యక్రమాల్లో ఒకటైన శిక్షా అవార్డులను విజయవంతంగా నిర్వహించినట్లు సంస్థ సీఈఓ సుమీట్ మెహతా తెలిపారు. ఎంజి రోడ్డులోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. వరుసగా రెండవ సంవత్సరం లీడ్ గ్రూప్ అందించిన శిక్షా అవార్డులు, విద్యార్థుల అభ్యాసాన్ని మారుస్తున్నాయని అన్నారు. విద్యార్థుల నేతృత్వంలోని సమావేశాలతో సహా పలు కార్యక్రమాల ద్వారా విద్యార్థుల విద్యలో తల్లిదండ్రుల ప్రమేయాన్ని ఇవి మెరుగుపరుస్తున్నాయని వెల్లడించారు. స్కూల్ లీడర్‌షిప్‌పై మాస్టర్ క్లాస్ కూడా ప్రదర్శించినట్లు తెలిపారు.

కౌన్సిలర్ నాగసుధ అంత్యక్రియలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి నాగసుధ అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. నాగసుధ (33) జ్వరంతో బాధపడుతూ అకస్మాత్తుగా ఆదివారం రాత్రి మరణించారు. ఆమె మృతదేహానికి కొండపల్లిలోని ఆర్‌సిఎం శ్మశానవాటికలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా స్థానిక ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు చేశారు. నాగసుధ భౌతికకాయాన్ని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సందర్శించి నివాళు లర్పించారు. టిడిపి నాయకులు కుమ్మరి శ్రీనును పరామర్శించారు.

మద్యం షాపులకు 40 దరఖాస్తులు

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు మద్యం షాపులకు టెండర్ దక్కించుకునేందుకు సోమవారం సాయంత్రానికి 40 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సిఐ అప్రపున్నీసా బేగం తెలిపారు. కంచికచర్ల-వీరులపాడు మండలాల పరిధిలో ఏడు షాపులకు అనుమతి ఉందన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్లైన్, ఆఫ్‌లైన్ ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఆహార ఉత్పత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాలలో వివిధ ఏడాది చదువుతున్న ఎనిమిది మందిని డాక్టర్ కెవిఎల్‌రావు కృషి విజ్ఞాన కేంద్రం దత్తత గ్రామాలైన బలుసుపాడు, గరికపాడు, తక్కెళ్లపాడులకు కేటాయించారు. సోమవారం తక్కెళ్లపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు విభాగాలకు సంబంధించిన వివిధ రకాలైన పోస్టర్లు, చాట్లు మోడల్స్ ఆహార ఉత్పత్తులను ప్రదర్శించారు. తక్కెళ్లపాడు సర్పంచ్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెవికె గరికపాడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణంరాజు, ఎస్ఎంఎస్ ప్రభావతి, సామాజిక కళాశాల సిబ్బంది డాక్టర్ కె లక్ష్మి, డాక్టర్ ఏ పూర్ణిమ, డాక్టర్ కే ధనశ్రీ పాల్గొన్నారు.

వేదాద్రి ఆలయంలో వేలం పాటలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో కొబ్బరి చిప్పలు పోగు చేసుకొను లైసెన్సు, తలనీ-పూలు అమ్ముకొను లైసెన్సులకు సోమవారం దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ విఎల్ ఇందిరాదత్తు ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకొను లైసెన్సుకు రూ.3.12 లక్షలు, తలనీ-పూలు అమ్ముకొను లైసెన్సుకు రూ. 3.10 లక్షలకు పాటదారులు దక్కించుకున్నారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.సురేష్‌బాబు తెలిపారు.

కొండపల్లి కమిషనర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు

కమిషనర్‌ను కలిసిన సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా పి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపాలిటీ కార్యదర్శి సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. గతంలో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పనిచేస్తున్న బి.రమ్య కీర్తన మరలా విజయవాడ జోనల్ వన్ కమిషనర్‌గా విధుల్లో చేరారు. శ్రీనివాసరావు గతంలో ఒంగోలు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి, ప్రస్తుతం గుంటూరు కార్పొరేషన్ సెక్రటరీగా పని చేస్తూ బదిలీపై కొండపల్లి వచ్చారు.

వేతన బకాయిలు ఇప్పించాలని వినతి

కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీనివాసరావును సిఐటియు నేతలు, మున్సిపల్ కార్మికులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గత నాలుగు నెలల నుండి మున్సిపల్ కార్మికులకు జీతాలు లేక పడుతున్న ఇబ్బందులను వివరించారు. పెండింగ్ జీతాలు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని జీతాలు తక్షణమే ఇచ్చే ప్రయత్నం చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ కార్మికుల జీతాలు, ఇతర సమస్యల పరిష్కారానికి 15 రోజుల సమయం ఇవ్వాలని తెలిపారు. కార్మికులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్, ఉపాధ్యక్షులు కె కొండలరావు, కొండపల్లి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రెసిడెంట్ బి అప్పారావు, సెక్రటరీ జి సురేష్, ఉపాధ్యక్షులు రమణ, దేవుళ్ళు, సభ్యులు నవీన్, మణికంఠ పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-మైలవరం

అక్రమంగా మద్యం బాటిల్స్ ను తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సుధాకర్ సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన 120 మద్యం బాటిళ్లను మైలవరానికి చెందిన మాదు వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై మైలవరం వస్తుండగా అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి తిరువూరు బైపాస్ రోడ్డులో అదుపులోకి తీసుకొని మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వే జిల్లా స్కౌట్స్‌కు అరుదైన గౌరవం

- పవన్ కల్యాణ్ చేతుల మీదుగా పలువురికి అవార్డులు
- సిబ్బందిని అభినందించిన ఉపముఖ్యమంత్రి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దక్షిణ మధ్యరైల్వే విజయవాడ డివిజన్ రైల్వే జిల్లా స్కౌట్ అండ్స్ గైడ్స్‌కు ఈ ఏడాది అరుదైన గౌరవం దక్కింది. అటవీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఈ విభాగానికి చెందిన విద్యార్థులు పాల్గొని విజయం సాధించారు. వారికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా మంగళగిరిలోని అటవీశాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్లో బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. పేరుపేరునా పిలిచి మరిన్ని విజయాలు సాధించాలని ప్రోత్సహించారు. స్కౌట్స్‌లో చిన్నారులు కూడా ఉండటంతో వారి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని, దానికి అవసరమైన ప్రోత్సాహాలు అందిస్తామని చెప్పారు. తొలుత స్కౌట్స్ అండ్ గైడ్స్ నుండి గౌరవవందనం స్వీకరించారు. వన్య ప్రాణుల రక్షణకు సంబంధించి నిర్వహించిన పోటీలో భాగంగా ఎలక్యూషన్‌లో ఎన్.నవీన్‌నంద, సిహెచ్.ఆరాధ్య, ఎస్సే రైటింగ్‌లో కె.అభినవ్,

టి.సృజన, పెయింటింగ్‌లో వి.నవీన్‌నంద, వై.సాహితి, వై.యోహోషువా క్విజ్‌లో ఎం.రాహుల్, డి.రాకేష్, కె.నాని, టోనేష్ ఉన్నారు. వీరిని రైల్వే అధికారులు అభినందించారు. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్లో వారికి చక్కని శిక్షణ ఇస్తున్న స్కౌట్స్ విజయవాడ రైల్వే డివిజన్ ఆర్గనైజింగ్ కమిషనర్ గోపాలకృష్ణ, విజయవాడ రైల్వే డివిజన్ స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ పి.అప్పలరాజును ప్రత్యేకంగా అభినందించారు. కబ్ మాస్టర్ వై.అశోక్, స్కౌట్ మాస్టర్లు ఎం.వి.ఎన్.డి.శ్రీకాంత్, జి.శ్రీకాంత్, రోవర్ స్కౌట్ లీడర్ ఎం.ఎస్.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య పరీక్షల పరికరాలు సమకూర్చడంతో పాటు, వివిధ సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పరిచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్లో జిల్లా ఖనిజ నిధి (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) వినియోగంపై పంచాయతీరాజ్ , వైద్య ఆరోగ్య, విద్య, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి కలెక్టర్ సమీక్షించారు. జిల్లా ఖనిజ నిధుల నుండి గతంలో మంజూరైన పనులు వాటి పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. పురోగతిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మంజూరైన పనుల్లో ఇంకా గ్రౌండింగ్ కానీ వాటిని, టెండర్లు పిలవని వాటిని క్యాన్సిల్ చేయుటకు, కొత్త పనులు చేపట్టుటకు ప్రతిపాదనలు పంపాలన్నారు.జిల్లా ఖనిజ నిధులతో తాగునీటి సరఫరా, ఆరోగ్య సంరక్షణ, విద్యా రంగాల్లో 55 శాతం నిధులు, రోడ్లు, వంతెనలకు 40 శాతం నిధులు వినియోగించాలనే నిబంధనలు కచ్చితంగా పాటించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్విప్మెంట్ ఏర్పాటు, సంక్షేమ హాస్టల్స్ లో మౌలిక సదుపాయాల కల్పన, అంగన్వాడీ కేంద్రాల్లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు, ఆక్వా ల్యాబ్స్ బలోపేత చర్యలు, తదితర పనులకు సంబంధిత శాఖల అధికారులు వెంటనే ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా గనుల శాఖ డిడి శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణారావు, డి ఎం అండ్ హెచ్ వో డాక్టర్ జి గీతాబాయి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ కుమార్‌రాజా

పలుచోట్ల 'ప్రజాదర్బార్'

ప్రజాశక్తి-పమిడిముక్కల : ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా అన్నారు. సోమవారం పమిడిముక్కల పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కూడేరు, అయినపూరు, లంకపల్లి తదితర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి సమస్యలపై అర్జీలు అందజేశారు. గ్రామ సర్పంచ్ ముళ్ళపూడి సునీత, మండల అభివ ద్ధి అధికారి విటల్ ఫాల్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, నాదెండ్ల సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ శీను పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెడన :** పట్టణ పరిధిలోని పల్లోటి వెనుక వైపు ఉన్న జగనన్న కాలనీ అలాగే పైడమ్మ కాలనీలలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయా కాలనీలోని మౌలిక సౌకర్యాలు కల్పించాలంటూ అయా ప్రాంతాల వాసులు అర్జీలు దాఖలు చేశారు. వీలైనంత త్వరలో వీటిని సమస్యలు కల్పించాలని స్థానికులు కోరారు

బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-కంకిపాడు : కానూరులోని ఉన్న సివిల్ సప్లై కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్‌గా తోటా సుధీర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎజెండాలో మొదటిగా అవినీతి నిర్మూలన చేస్తానని హామీ ఇచ్చారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సివిల్ సప్లై ఉద్యోగస్తులపై రేషన్ మాఫియా దాడులు చేస్తే వారిని ఉపేక్షించేది లేదని అన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ

ప్రజాశక్తి-చల్లపల్లి : మండలపరిధిని పురిటిగడ్డలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి దాతలు వాటర్ డిస్పెన్సర్ బహుకరించారు. సోమవారం నడకుదురు శివారు నాదెళ్లవారిపాలెం గ్రామానికి చెందిన కాకర్ల రాధాకృష్ణ జ్ఞాపకార్థం ఆయన భార్య ప్రమీలా రాణి రూ.పదకొండు వేలు విలువ కలిగిన వాటర్ డిస్పెన్సర్ బహుకరించారు. ఆరోగ్య కేంద్ర స్థల దాత రిటైర్డ్ ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణ ఈ డిస్పెన్సరీని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ కేవీ పద్మావతి, పురిటిగడ్డ మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపైకి మురుగు నీరు

జాతీయ రహదారిపై నిలిచిన నీరు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరంలో సోమవారం సాయంత్రంకురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయంఅయ్యాయి. కొత్తపేట వద్ద జాతీయ రహదారిపై రెండు అడుగుల ఎత్తున నీరు నిలిచింది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అదేవిధంగా బుద్ధవరం రోడ్డు, ఆగిరిపల్లి రోడ్ లో నీరు నిలవడంతో ప్రయా ణికులు పడ్డారు. మురుగు కాలువలు పొంగి రోడ్లమీదకు రావడంతో ప్రజలు ఇక్కట్లకు లోనయ్యారు. గంట పాటు జనజీవనం స్తంభించింది.

'మీకోసం'లో 135 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రజల నుండి అందే అర్జీల పట్ల అత్యధిక ప్రాధాన్యత నిచ్చి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డిఆర్ఓ కె చంద్రశేఖరరావు, కెఆర్ఆర్సిఎస్ డి సి శ్రీదేవి మచిలీపట్నం ఆర్డిఓ స్వాతి లతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అర్జీలు అందే మీకోసం అర్జీలు ప్రామాణికంగా పరిష్కరించాలన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం అవుతుందంటే అవుతుందని చెప్పాలని, ఆర్థికపరమైన పెన్షన్లకు సంబంధించి స్పష్టంగా అర్జీదారులకు వివరించాలన్నారు. అంతేకానీ అనవసరంగా ప్రజలను కార్యాలయాలు చుట్టూ పదేపదే తిప్పించుకోరాదన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖలో కింది స్థాయి సిబ్బంది వరకు వారికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మీకోసం లో భాగంగా మొత్తం 135 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు.

దాళ్వా వరి పంటకు నీరు అందించాలి :ఏపి రైతు సంఘం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ బంటుమిల్లి మండలం చోరంపూడి కాలువపై శిథిలమైన డ్రాప్ స్థానంలో పునర్నిర్మానం చేయాలని, రబికి దాళ్వా వరి పంటకు బంటుమిల్లి కాలువ నుండి సాగునీరు అనుమతించాలని కోరుతూ అర్జీ అందజేశారు. అర్జీ ఇచ్చిన వారిలో కైల.శ్రీ రామాంజ నేయులు, కె.లక్ష్మణరాజు లు ఉన్నారు.

మీకోసం ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యత: ఎస్పి

ప్రజల సమస్యలను చట్టపరిధిలో విచారించి న్యాయం అందించడానికి కృష్ణాజిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుందని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందరరేగా ఎస్పీ మాట్లాడుతూ సమస్య తీవ్రత ఎలా ఉన్నా చట్ట పరిధిలో పూర్తిస్థాయి విచారణ జరిపి నిర్ణీత గడువు లోపల పరిష్కారం అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పెరిగిన సందర్శకులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ కాశీ అన్నపూర్ణదేవిగా అమ్మవారు భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. అనంతరం కుంకుమార్చన, దోష పరిహారం కాత్యాయని హెూమం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ భక్తాంజనేయ భక్త సమాజం తాడూరు, భోగిరెడ్డిపల్లి వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. అభినయ నాట్య అకాడమీ వారిచే కూచిపూడి నత్య ప్రదర్శన, స్త్రీ మోడల్ స్పెషల్ రెసిడెంటల్ ఆశ్రమం వారిచే సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, జిల్లా రిజిస్టర్ వి వి ఎస్ ఆర్ ప్రసాద్, గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అమ్మవారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈవో తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా గుడ్లవల్లేరు-అడ్డాడ రోడ్డు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు నుండి అడ్డాడ వెళ్ళే రహదారి పెద్ద పెద్ద గుంతలతో ధ్వంసం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ, పామర్రు, అడ్డాడ, పెంజెంద్ర మీదుగా గుడ్లవల్లేరు గ్రామానికి వందలాది మంది ప్రయాణికులు బైక్, ఆటో, బస్సు కారులలో ప్రయాణిస్తున్నారు. గుడ్లవల్లేరులో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటిఐ వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంవల్ల నిత్యం ఈ రహదారిలో ఉద్యోగస్తులు, విద్యార్థులు రావాల్సి ఉంటుంది. గుడ్లవల్లేరు నుండి అడ్డాడ వరకు అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని చెప్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కనీసం మరమ్మతులైన చేపట్టి వాహనదారులు ప్రమాదాల భారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

కంప్యూటర్లుపై కవర్లు పెట్టిన దృశ్యం

గన్నవరం తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది కష్టాలు తీరేనా...?

ప్రజాశక్తి-గన్నవరం : చిన్నపాటి వర్షానికి తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో అంతా నీరు చేరి, సిబ్బంది అనేక రకాలుగా ఇబ్బందులకు గురి అవుతున్నారు. అసలే పని ఒత్తిడి, ఆపై పడిన వర్షానికి పరికరాలు, పత్రాలు భద్ర పరచడం లో అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. అట్టలు అడ్డం పెట్టుకొని పని చెయ్యాల్సిన పరిస్థితి ఉందని సిబ్బంది గగ్గోలు పెడుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు ద ష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కార మార్గానికి క షి చేయాలని సిబ్బంది అభ్యర్థన వ్యక్తం చేశారు.

మైత్రీ ఫౌండేషన్ సభ్యులు ఫణికుమార్‌కు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మైత్రీ ఫౌండేషన్ గౌరవ సభ్యులు నీలపాల ఫణి కుమార్‌కి అరుదైన గౌరవం లభించింది. ప్రఖ్యాత సేవ సంస్థ బహుజన సాహిత్య అకాడెమీ (బిఎస్ ఏ)ఆధ్వర్యంలో తిరుపతి కేంద్రంగా జరిగిన 8వ సౌత్ ఇండియా కానారేన్స్ కార్యక్రమంలో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ నుండి ఉత్తమ సేవలకు గుర్తింపుగా కృష్ణా జిల్లా మైత్రి ఫౌండేషన్ గౌరవ సభ్యులు ఫణికుమార్‌కి సేవారత్న అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా బి ఎస్ ఏ తరుపున సర్టిఫికెట్ మెమెంటో శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా ఫణి చేస్తున్న సేవలను సంస్థ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ కొనియాడారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

సిపిఎం 50వ డివిజన్ కార్పొరేటర్ సత్యబాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: 50వ డివిజన్లో టిఎస్‌పి వీధీ, మేకల వీధి, ఆలేటివారి వీధీ గొల్లపాలెంగట్టు రోడ్డు, ఏరియాలో గత కొద్ది రోజులుగా రిజర్వాయర్లు నిండకపోవటం వలన ప్రజలు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం డివిజన్‌లో పలు ప్రాంతాలలో కార్పొరేటర్ బోయి సత్యబాబు పర్యటించి స్థానికుల సమస్యలను మంచినీటి విభాగం విఎంసి అధికారులను పిలిచి చూపించారు. అనంతరం సత్యబాబు మాట్లాడుతూ మంచినీటి ఇబ్బందుల విషయమై సిపిఎం, ప్రజలు సమస్యలను మున్సిపల్ కమిషనర్‌కు, సంబంధిత అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేయడం జరిగిందని, అయినా పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. అందుకే ఈరోజు ఏఇ రాజేష్‌తో కలిసి 50వ డివిజన్‌లో తాను పర్యటించినట్లు కార్పొరేటర్ సత్యబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మంచినీటి ఇబ్బందులపై తమ గోడు వెళ్ళబుచ్చి, తీవ్ర అవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు, మంచినీరు సక్రమంగా పంపిణీ చేయకపోతే ప్రజల యొక్క ఆందోళనకు అధికారులు బాధ్యులు అవుతారని తెలిపారు. వర్షాకాలం కూడా నీటి కొరతతో ప్రజలు ఇబ్బందిపడటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు పి. రాజు, కే. లక్ష్మణ, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఇ రాజేష్‌కు వినతిపత్రం అందజేసినట్లు సత్యబాబు తెలిపారు.

ఆకుల శ్రీనివాసకుమార్‌ను సత్కరిస్తున్న దేవస్థానం కమిటీ సభ్యులు

చిట్టినగర్‌లో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు యాత్రికులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆకుల శ్రీనివాసకుమార్, ఆయన కుమారుడు డాక్టర్ రాజ్‌కుమార్, శ్రీశైలంలోని నగరాల అన్నసత్రం కమిటీ కార్యదర్శి కొరగంజి జగన్, ఆర్టీసీ ఎండి సీసీ బాలస్వామి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, గౌరవాధ్యక్షులు బెవర సూర్యనారాయణ, దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్ (రాజా), శీరం వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు మజ్జి ఈశ్వరరావు, తొత్తడి భరత్ కుమార్, పోతిన సాంబశివరావు, భోగవల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

పీడీ వెంకటేశ్వర్లుకు సన్మానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఈ ఏడాది జులై నెలలో మధ్యప్రదేశ్ రాష్ట్రం

ఇండోర్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో 3 గోల్డ్ మెడల్స్, 1 స్ట్రాంగ్ మెన్ ఆఫ్ ఇండియా అవార్డులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గంటా వెంకటేశ్వర్లు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం వెంకటేశ్వర్లును ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి వైయు సుబ్బారావు, ఏడి కుమార్ సన్మానించారు.

క్రికెట్ పోటీలకు సాయిరామ్ ఎంపిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఏసిఏ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుండి గుంటూరులో జరిగే అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టుకు పట్టణంలోని తపోవన్ విద్యాలయం పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి బివిఎంఎస్ సాయిరామ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తపోవన్ విద్యాలయం ప్రిన్సిపాల్ మందడపు సుధీర్ కోచ్ రాజేంద్ర, విద్యార్థిని అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ శాంతి నగర్ సచివాలయం పరిధిలో అంగన్వాడీ కేంద్రాన్ని ఎంఎస్ కె. విజ యలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తు న్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పోషకాహారంలోని నాణ్యతతో పాటు లబ్ధిదారులు సక్రమంగా వినియోగిం చుకుంటున్నారా అని అక్కడున్న బాలింతలు, గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ పోషకాహార కిట్‌లను అందజేశారు. అంగన్వాడీ టీచర్ పీ సుశీల పనితీరును ప్రశంసించారు.

గోవుల తరలింపు అడ్డగింత

ప్రజాశక్తి-గంపలగూడెం: ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్ నుండి తరలిస్తున్న మూడు ఎడ్ల వాహనాలను నిలిపివేసినట్లు నెమలి గ్రామస్తులు తెలిపారు. ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో నెమలి గ్రామం నుండి తెలంగాణకు పోతున్న మూడు లారీలను అనుమానంతో ఆపారు. అందులో ఎడ్లను తరలిస్తున్న గ్రామస్తులు కొందరు అడ్డగించి, డ్రైవర్లపై గొడవ చేసినట్లు తెలిసింది. నలుగురికి పదిమంది పోగైన పరిస్థితుల్లో స్థానిక ఎస్సైకి ఫోన్ చేసినట్లు సమాచారం. ఎస్సై తన సిబ్బందితో ఎస్ఐఎస్ శ్రీనివాస్ వెళ్లగా, మూడు లారీలు నిలిపివేయబడ్డాయి. వివరాలు తెలుసుకున్న ఎస్ఐ మూడు వాహనాలను గంపలగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉంటే ఇప్పటికే మూడు రోజుల నాడు ఇదే తరలింపులో భాగంగా, పట్టుకున్న ఎడ్లను గ్రామంలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ కమిటీకి పోషణార్థం

అప్పగించినట్లు తెలిసింది. దాతలు మొక్కులలో భాగంగా, వచ్చిన మూడు నాలుగు గోవులనే మేపలేని పరిస్థితుల్లో ఒక్కసారిగా ఎక్కువ గోవులను అప్పగించడంతో మేత కూడా వేయలేని పరిస్థితి ఏర్పడ్డాయి. దీనితో ఆ గోవులు ఆకలితో అలమటిస్తున్నట్లు తెలిసింది. అయితే పట్టుకున్న గోవులను గుంటూరు జిల్లా అనంతవరం గోశాలలో అప్పగించినట్లు ఎస్సై ఎస్ శ్రీనివాస్ తెలిపారు.

సేంద్రీయ సాగు ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి-తిరువూరు: సేంద్రీయ పద్ధతిలో సాగుచేసిన పండ్లు కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని తిరువూరు మండల వ్యవసాయ అధికారి పి.పద్మ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ప్రక తి సాగు

విధానంలో పండించిన కూరగాయల స్టాల్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువులు పురుగుమందులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల రోజురోజుకు అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. అందరూ ప్రక తి సిద్ధంగా పండించిన కూరగాయలు ఆకుకూరలు కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవా లని సూచించారు. ఈ- క్రాప్ బుకింగ్ (పంటల నమోదు), ఈ- కేవైసీ ఈ నెల 9వ తేదీతో ముగుస్తున్నందున రైతులం దరూ వెంటనే రైతు సేవ కేంద్రాల్లో తమ పండించిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని వేలి ముద్రలు కూడా వేయాలని పద్మ కోరారు. ఈ- పంట, ఈ కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు అందుతాయని తెలిపారు.

టాటా పంచ్ కామో కారు పరిచయం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ ఎస్యూవీ తయారీదారు అయిన టాటా మోటార్స్ తన టాటా పంచ్ ప్రత్యేక, పరిమిత కాల కామో కారును పరిచయం చేసింది. ఈ సందర్భంగా నగరంలోని టాటా మోటార్స్ డీలర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవత్స మాట్లాడుతూ కొత్త సీవీడ్ గ్రీన్ కలర్‌లో వైట్ రూఫ్, ఆర్ 16 చార్‌కోల్ గ్రే అల్లాయ్ వీల్స్ ప్రత్యేకమైన కామో నేపథ్య నమూనాను కలిగి ఉన్న ప్రీమియం అప్‌హోల్‌స్టరీతో అందుబాటులో ఉందని చెప్పారు. ఆటో యాపిల్ కార్ ప్లే, వైర్‌లెస్ ఛార్జర్, వెనుక ఏసీ వెంట్‌లు వేగవంతమైన సి-రకం యుఎస్ బి ఛార్జర్, ఆర్మ్‌రెస్ట్‌తో కూడిన గ్రాండ్ కన్సోల్ వంటి కంఫర్ట్-టెక్ ఫీచర్లను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. టాటా పంచ్ కామో రూ. 8,44,900 లక్షల (ఎక్స్‌షోరూమ్) ప్రారంభ ధర వద్ద అందుబాటులో ఉందన్నారు. పంచ్ కామో ఇప్పుడు టాటా మోటార్స్ వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చునని చెప్పారు. టాటా పంచ్ 2021లో ప్రారంభించినప్పటి నుండి, పంచ్ దాని అద్భుతమైన డిజైన్, బహుముఖ ఆకర్షణీయమైన పనితీరు, విశాలమైన ఇంటీరియర్స్ మరియు సంపూర్ణ భద్రతకు చాలా ప్రశంసలు అందుకుందన్నారు. కీలకమైన ఎస్యూవీ అట్రిబ్యూట్‌లను విజయవంతంగా డెమోక్రటైజ్ చేయడం ద్వారా మరియు కాంపాక్ట్ ఫుట్‌ప్రింట్‌లో ఒక సమగ్ర ప్యాకేజీని అందించడం ద్వారా ఇది కొత్త సెగ్మెంట్‌ను స్థాపించిందని తెలిపారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-నందిగామ: దసరా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించిన విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నందిగామ కమిటీ నాయకులు షేక్ ఖజా, వెంకటేష్ మాట్లాడుతూ నందిగామలోని కొన్ని స్కూళ్లల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవులు ఇవ్వకుండా విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నందిగామ నగరంలో ఉన్న మరియనివాస్, గౌతమి మరికొన్ని ప్రైవేట్ స్కూళ్లల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తుంటే విద్యార్థులను బయటికి పంపించేశామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెలవు దినాల్లో తరగతులు నిర్వహించకుండా చూడాలని, అలా నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హషేన్, వెంకటేష్, షాక్ ఖజు, నరసింహ, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-విజయవాడ: యువతిని వేధిస్తున్న ఒక వ్యక్తిని కృష్ణలంక పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామానికి చెందిన చెన్నూరి సుబ్రహ్మణ్యం ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో రాజీవ్‌గాంధీ పార్కు వద్ద ఒక అమ్మాయిని తీసుకెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఆ సమీపంలో ఉన్న పోలీసులు పారిపోతున్న అతన్ని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-తిరువూరు: గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన సోమవారం తిరువూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కాలేజ్ సమీపంలో కట్టలేరు వాగులో మృతదేహం ఉందని వచ్చిన సంచారం మేరకు కానిస్టేబుళ్లు రాంబాబు, ఆకాష్ సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయగా సుమారు 30 సంవత్సరాల వయసు గల యువకుడి ఒంటిపై షర్టు లేకుండా జీన్ ప్యాయింట్ ధరించి ఉన్నాడని, మద్యం సేవించి బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీళ్లలో పడి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇండియా పోస్ట్‌తో అమెజాన్ ఒప్పందం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

లాజిస్టిక్స్ భాగస్వామ్యాన్ని పటిష్టం చేసుకునేందుకు అమెజాన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ (ఇండియా పోస్ట్) వ్యూహాత్మక అవగాహన ఒప్పందాన్ని చేసుకున్నట్లు అమెజాన్ ప్రతినిధి ఎస్.సుబ్రమణ్యం తెలిపారు.నగరంలోని అమెజాన్ మల్టి స్టోర్ నందు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. అమెజాన్ కస్టమర్ సెంట్రిసిటీ, సాంకేతిక నైపుణ్యాన్ని ఇండియా పోస్ట్ విస్తారమైన లాస్ట్ మైల్ డెలివరీ నెట్‌వర్క్, ద్వారా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ-కామర్స్ లాజిస్టిక్స్‌లో బెంచ్‌మార్క్‌లను పునర్నిర్వ చించడమే ఈ సహకారం ఉద్దేశం. అన్నారు .అవగాహన ఒప్పందం ప్రకారం, సామర్థ్యాలను పెంచేందుకు, వనరుల వినియోగాన్ని ఆప్టిమైజ్ చేయడానికి, వారి లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లలో సామర్థ్య భాగస్వామ్యాన్ని అన్వేషించేందుకు ఉపయోగ పడతాయని అన్నారు. మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో డెలివరీ అనుభవాన్ని పెంచుతూ పరస్పర వృద్ధిని పెంచుతుంది. అన్నారు.

ఉత్సవాల ఏర్పాట్లపై నిరంతరం పర్యవేక్షణ

ప్రజాశక్తి - వన్‌టౌన్/విజయవాడ అర్బన్ : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు కనకదుర్గమ్మ అమ్మవారు "శ్రీ మహా చండీదేవి"గా యాత్రికులకు దర్శనమిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. సృజన, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల ఏర్పాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా క్యూ లైన్లన్నీ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, చంటి బిడ్డల తల్లులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకుని వారికి కావల్సిన ఏర్పాట్లను వెను వెంటనే ఏర్పాటు చేస్తున్నారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు త్రాగునీరు, చిన్న పిల్లలు, బాలింతలకు వేడిపాలు, మజ్జిగ ప్యాకెట్లు అందించం జరుగుతోందన్నారు. రూ. 500, 300, 100 క్యూ లైన్లతో పాటు ఉచిత దర్శనం క్యూ లైన్లు కూడాభక్తులు ఆగకుండా నిరంతరం సాఫీగా సాగేవిధంగా అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కొండ దిగువన శ్రీ వినాయక గుడి వద్ద నుండి కొండపై వరా క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షించి, ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. క్యూ లైన్లలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే వాటిని పరిష్కరించే దశగా అధికారులు అప్రమత్తమవుతున్నారన్నారు. విఐపిలు, వివిఐపిలు దర్శనానికి వచ్చినప్పటికీ సామాన్య భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వృద్ధులు, వికలాంగులన కొండ దిగువ నుండి ప్రత్యేక వాహనాలలో తీసుకువచ్చి వారికి దర్శనం చేయించి తిరిగి వారిని కొండ క్రింది వరకు చేర్చేలా బాధ్యతను పోలీస్ సేవాదళం సిబ్బంది తీసుకుంటున్నారని తెలిపారు.

అన్నప్రసాదాలు స్టాక్ రికార్డుల తనిఖీ

అమ్మ వారి సన్నిధిలో దసరా ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఏ విధంగా అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు అందుకు సంబంధించిన స్టాక్ వెరిఫికేషన్ రికార్డులను కలెక్టర్ సృజన తనిఖీ చేశారు. సోమవారం అన్న ప్రసాదాల పంపిణీ కు సంబంధించిన విభాగంలో కలెక్టర్ తనిఖీ చేసి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగానే ఆహార భద్రత అధికారులు ఈ పరిశీలన కార్యక్రమంలో పాల్గొ న్నారు. భక్తులకు అందిస్తున్న అన్న ప్రసాదాలను నాణ్యమైన నిత్యవసర సరుకులు వినియోగిస్తున్నారని తెలుసుకోవడం జరిగింది.

అన్నప్రసాదాలు స్టాక్ రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్

వినతిపత్రం అందిస్తున్న ఎంఎల్‌ఏ వసంత కృష్ణప్రసాదు

కొండపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లకు ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీకి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు త్వరగా ఎన్నికలు నిర్వహించాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సోమవారం విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ఏపీ స్టేట్ ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని ఎమ్మెల్యేకలిశారు. కొండపల్లి మున్సిపాలిటీకి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల ప్రజలకు సత్వర సేవలను అందించడంలో కలుగుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించి సాధ్య మైనంత త్వరగా ఎన్నికలను నిర్వహిస్తామని వెల్లడించారు.

వరద బాధితులందరికీ న్యాయం చేయాలి: పోతిన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : బుడమేరు వరద విషయంలో చంద్రబాబు ప్రజలకు అన్యాయం చేసారని వైసీపీ రాష్ట్ర నాయకులు పోతిన మహేష్ ఘాటువిమర్శలు చేసారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతు బుడమేరు వరద విజయవాడ ప్రజలకు కన్నీళ్లు మిగిల్చితే, చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి వందలకోట్ల రూపాయలు మిగిల్చిందన్నారు. వరద బాధితులకు సరైన నష్ట పరిహారం ఇవ్వలేదని విమర్శించారు.నష్ట పరిహారం కోసం ప్రజలు రోడ్డెక్కితే పోలీసులచే లాఠీచార్జి చేయించారని, వరద సాయం మొత్తం ఏమైందని ప్రశ్నించారు.

దసరా విధులకు వచ్చి

హోటల్లో పేకాట ఆడిన సిఐలు ?

- సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగరంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన నలుగురు సిఐలు, ఓ పార్టీ నాయకుడు వన్‌టౌన్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం రాత్రి పేకాట ఆడినట్లు సోషల్ మీడియాలో ఓ వీడియో హల్‌చేస్తోంది. కొత్తపేటలో గల ఓ హోటల్ రూమ్‌లో పేకాట ఆడుతున్న దశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించి నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

సిపిఎం కార్యదర్శి ఎన్నిక

ప్రజాశక్తి-మొవ్వ : సిపిఎం నిడుమోలు గ్రామ శాఖ కార్యదర్శిగా ఉప్పలపు వెంకటాద్రిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం నిడుమోలు గ్రామ శాఖ మహాసభ నిడుమోలు గ్రామంలో జరిగింది. తొలుత పార్టీ సీనియర్ నాయకులు మద్దుల బసవరావు జెండా ఆవిష్కరణ చేసి మహాసభను ప్రారంభించిన అనంతరం బసవ రావు అధ్యక్షతన మహాసభ జరిగింది. ఈ మహాసభకు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణ రావు హాజరయ్యారు. నిడుమోలు గ్రామంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-మైలవరం: ఇంటర్న్ షిప్‌ల వల్ల విద్యార్థులు వర్కింగ్ స్కిల్స్ ను పెంపొందించుకోవచ్చని ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం సమగ్ర శిక్ష రాష్ట్ర అధికారిని డి రాణి, జి సి డి ఓ శాంతిలు పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు పలుచోట్ల చేస్తున్న ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం ను ఆదివారం, సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంటర్నెట్ షిప్పులు చేయటం వల్ల ఉన్నత చదువుకు దోహదపడుతుందన్నారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ వోకేషనల్ ట్రైనర్ మాస్టర్ ఎం చెన్నారావు, హై స్కూల్ ఎలక్ట్రానిక్స్ ఒకేషనల్ టీచర్ ఏ ఆశ, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభినందన సభ

మరియపీటర్, రూపాలను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు గుండాబత్తిన మరియపీటర్, సహాయ కార్యదర్శి చోడవరపు రూపాలకు స్థానిక సిఐటియు కార్యాలయంలో అభినందన సభ సోమవారం జరిగింది. గుడివాడ సుందరయ్య భవనంలో జరిగిన ఈ సభకు సాహితీ స్రవంతి అధ్యక్షులు లంకా సురేంద్ర అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా ఏఎన్ఆర్ కళాశాల విశ్రాంత చరిత్ర విభాగపు అధిపతి కోగంటి గాంధీ బాబు, రిటైర్డ్ ఎమ్.ఈ. ఓ.భవిరి శంకర నాధ్, తెలుగు భాష వికాశ సమితి కన్వీనర్ డి.ఆర్.బి.ప్రసాద్, నవ్వుల పోదరిల్లు అధ్యక్షులు ఎమ్.ఎస్.వి.సత్యనారాయణ బాబు, పంచాయితీ విస్తరణ అధికారి కవి వంగా వంశీ, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు నీలం ప్రభాకర్, ఏఐటియుసి బిల్డింగ్ కన్వీనర్ కొమ్ము సురేష్, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి కార్యదర్శి గునుకుల మాల్యాద్రి, సిఐటియు ఉపాధ్యక్షులు ఆర్.సి.పి.రెడ్డి, కవి విశ్రాంత ఆంధ్రబ్యాంక్ అస్సిస్టెంట్ మేనేజర్ వసుధ భోగేశ్వరరావు, కవి బి.వి.శ్రీనివాసరావు, ఐద్వా కార్యదర్శి రజని, వడ్డాది వెంకట్, రిటైర్డ్ ఆర్టీసీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 27 తేదీ ఆదివారం ఆరుద్ర సతవర్ధంతి సెమినార్, పాటలు, కవితలు రాష్ట్ర సాహితీ స్రవంతి వారి సహకారంతో నిర్వహించావాలనే ఆలోచనను సభ ముందు సురేంద్ర ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు.

శిక్షణా తరగతులు వెలవెల

ప్రజాశక్తి-ఉంగుటూరు : స్థానికంగా క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులను చైతన్యం చేసేందుకు తలపెట్టిన శిక్షణా తరగతులు వెలవెలబోయాయి, గ్రామాల అభివృద్ధిలో భాగంగా గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామ పంచాయతీ చట్టాలపై అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఈనెల 7 వ తేదీ నుండి 10వ తేదీ వరకు రెండు దశల్లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసింది. సోమవారం మొదటి దశ శిక్షణా తరగతులకు మండలంలోని ఆముదాలపల్లి, ఆత్కూరు, చికినాల, చాగంటి పాడు, ఎలుకపాడు, గారపాడు, ఇందుపల్లి, కొయ్యగూరపాడు, లంకపల్లి, మధిర పాడు, మానికొండ, ముక్క పాడు, నాగవరప్పాడు, గ్రామాల నుండి ఉప సర్పంచ్ లు ప్రతి గ్రామం నుండి ఇద్దరు వార్డు సభ్యులు ఈ తరగతులకు హాజరు కావలసి ఉంది. అయితే ఇటీవల గ్రామ కార్యదర్శులు గ్రేడ్ 5, 6 కార్యదర్శులు మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఈనెల 7 నుండి 10వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు చేపట్టింది. దీంతో అధికారులకు, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయ లోపంతో ఈ శిక్షణా తరగతులు వెలవెల బోయాయి. ఈ శిక్షణా తరగతుల్లో ఉప సర్పంచ్ వార్డు సభ్యులు మొత్తంగా పదిమంది లోపే ఉండటం గమనార్హం. హాజరైన కొంతమంది సభ్యులకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపిడివో ఈ సత్యకుమార్ గ్రామాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ప్రజాశక్తి-నాగాయలంక : మండలపరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు మండల స్థాయిలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ఎంపీడీఓ సీతారామకుమార్ సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు కార్యక్రమంలో మండల రెవిన్యూ అధికారి ఎం.హరనాథ్ బాబు, వక్కపట్లవారిపాలెం సర్పంచ్ అంబటి శ్యామ్ ప్రసాద్, మండల విస్తరణాధికారి కె.అప్పల నరసమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని కామన్ అడ్మినిస్ట్రేషన్ ప్రొసీజర్, రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం 1994, పారిశుద్ధ్యం తాగునీరు, ఘనవ్యర్థాల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు తదితరాల గురించి సభ్యులకు అవగాహన కల్పించారు.

ఉచిత ఇసుక సరఫరాకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని వినియోగ దారులకు ఉచిత ఇసుకను అందించేందుకు టెండర్ ప్రక్రియ ద్వారా ఏజెన్సీని గుర్తించి ఖరారు చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్లోని కలెక్టర్ చాంబర్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రీచ్‌లలో ఇసుక తవ్వి వాహనముల ద్వారా సమీపంలోని స్టాక్ యార్డులకు చేర్చడం, రవాణా నిమిత్తం ర్యాంపుల నిర్మాణం, అప్రోచ్ రహదారుల నిర్వహణ, స్టాక్ యార్డులలో వినియోగదారుల వాహనాలకు ఇసుక లోడింగ్ చేయడం వంటి ప్రక్రియలకు ఏజెన్సీలను గుర్తించేందుకు నిర్ణీత సమయంలోగా టెండర్ ప్రక్రియను చేపట్టి ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఏజెన్సీని ఖరారు చేసేందుకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా గనులు భూగర్భశాఖ, రవాణా, ఇరిగేషన్ శాఖ అధికారులతో కూడిన సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.స్టాక్ యార్డుకు కనీసం ఇద్దరు చొప్పున షిఫ్ట్ పద్ధతిలో పోలీసు, రెవెన్యూ సిబ్బందిని నియమించడం, సీసీటీవీ ల ఏర్పాటు, మొబైల్ ఫోన్లు, పాయింట్ ఆఫ్ సేల్ మిషన్ల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఏఎస్ పి ప్రసాద్, బందరు ఆర్డీఓ కే స్వాతి పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

ప్రభుత్వపరంగా నిర్ణీత లక్ష్యాలను సమన్వయంతో పూర్తిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీకోసం కార్యక్రమం ముందు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చాలామంది జిల్లా అధికారులు బదిలీపై కొత్తగా జిల్లాకు వచ్చారన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ జిల్లా అధికారి వారి పరిధిలో ప్రతిరోజు లేదా రెండు రోజులకు ఒకసారి తప్పనిసరిగా వారి కార్యకలాపాలను సమీక్షించుకోవాలన్నారు.

మహాచండీ దేవికి నృత్య హారతి

● ఆకట్టుకుంటున్న చిన్నారుల కళా ప్రదర్శనలు ● దుర్గమ్మ దర్శనానికి తరలివస్తున్న యాత్రికులు

శ్రీకాళహస్తి నుంచి దుర్గమ్మకు సారె

ప్రజాశక్తి-విజయవాడ, విజయవాడ అర్బన్, వన్‌టౌన్

దుర్గగుడికి రాష్ట్రంలోని వివిధ దేవాలయాల నుంచి సారె సమర్పించడం ఒక సంప్రదాయం. ఇందులో భాగంగా సోమవారం తిరుపతి జిల్లాలోని శ్రీ కాళహస్తీశ్వర దేవస్థాన ప్రతినిధులు ఇంద్రకీలాద్రికి చేరుకొని అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. శ్రీ మహా చండీ దేవి

అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈవో ఎస్.ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని అధికారులు, వేద పండితుల బృందం అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. అనంతరం శ్రీ కాళహస్తీశ్వర దేవస్థాన ఈవో ఆజాద్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ ఏటా దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించడం సంప్రదాయంగా వస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది శ్రీ మహాచండీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి సారె సమర్పించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి-విజయవాడ, విజయవాడ అర్బన్, వన్‌టౌన్

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం కనకదుర్గమ్మ శ్రీ మహాచండీ దేవిగా దర్శనమిచ్చింది. దుర్గమ్మను దర్శించుకునేందుకు యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుండే వినాయకుని గుడి వద్ద నుండి ఏర్పాటు చేసిన మూడు క్యూ లైన్ల ద్వారా యాత్రికులు ఇంద్రకీలాద్రి కొండపైకి చేరుకుని దుర్గమ్మను దర్శించుకున్నారు. సుమారు 75 వేల మందికి పైగా శ్రీ మహా చండీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు దంపతులు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన దుర్గమ్మను దర్శించుకున్నారు.

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో భాగంగా కళాకారులు అమ్మవారికి కళాభిషేకం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులు కళాప్రదర్శనలు తిలకించి పరవశించిపోతున్నారు. సోమవారం కనకదుర్గ నగర్‌లోని కళావేదికపై రామాంజనేయులు బృందం, దీపిక, పార్థసారథి ఆలపించిన భజన సంకీర్తనలు వీనుల విందుగా ఓలలాడించాయి. కళాకారులు దుర్గేష్, నందిని సంగీత విభావరి వినసొంపుగా సాగింది. అమ్మవారిని పూజిస్తూ మైమరిచిపోతూ ఆలపించారు. నృత్య కళాకారులు శ్రీరామచంద్రమూర్తి, సత్యవాణి, సౌమ్య, నవ్య ప్రదర్శించిన కళారూపాలు వీక్షకులను కట్టిపడేసాయి. అదే కోవలో అలేఖ్య, రంజిత్, నీరజ గీత, లీలావతి, విజయలక్ష్మి, వాత్సల్య నృత్యాలు అమ్మవారి విశిష్టతను కళ్లకు కట్టినట్లు సాక్షాత్కరింపజేశాయి. సిహెచ్.నాగబాబు హరికథ ఆకట్టుకుంది. చదువుతో పాటు చిన్నారులు లలిత కళలపై భక్తి భావంతో ఇటువంటి కార్యక్రమాలలో పాలు పంచుకోవడం అభినందనీయమని ప్రేక్షకులు అభినందించారు.

దుర్గమ్మ సన్నిధిలో యార్లగడ్డ దంపతులు

సాంప్రదాయ నృత్యాల నడుమ నగరోత్సవం

ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దుర్గా శరన్నవరాత్రులు వైభవోపేతంగా జరుగుతున్నాయి. సోమవారం ఐదవ రోజు శ్రీ మహా చండీదేవి అలంకారంలో దుర్గమ్మ యాత్రికులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై సంప్రదాయ నత్యాల నడుమ ఆది దంపతుల నగరోత్సవం సాగింది. శ్రీ మహా చండీదేవి అలంకత అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన భక్తజనుల జయ జయ ధ్వానాల మధ్య నగర ఉత్సవం కనుల పండువగా సాగింది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.